# దెయ్యాలతోవు

కాస్తో కూస్తో విజ్ఞానం కలిగిన నేను జీవితాంతం వరకూ విచారించవలసిన ఆ తప్పును ఎందుకు చేశానూ అనేది అనవసరం. దాన్నిగురించి చింతించటంగూడా మాను కొన్నాను.

అప్పటికీ సాధ్యమయినంత వరకూ ప్రయత్నించాను. ఆమెలో లేనిఅందాన్ని సృష్టించుకొని, మనస్సునంతా బల వత్తరంగా కేంద్రీకరించి చూచాను. కాని రాధను నేను ప్రేమించలేకపోయాను. కనీసం ఒక సాధారణ మానవుణ్ణి చూచి అభిమానపడే మాత్రమైనా నేను రాధనుచూచి పడ లేను. రాధ అందం నన్ను వుద్రేకపరచదు. నాలోని వుత్సా హాన్ని చంపి నిస్సత్తువను ప్రవేశపెడుతుంది. అందుకే నేను విచారిస్తున్నాను. నన్ను చేసుకుని రాధ అనుభవిస్తున్న సుఖ మేమీ లేదు. తిండి తింటుంది. అందమైన గుడ్డలు కట్టు కొంటుంది. స్వేచ్ఛగా డబ్బు ఖర్చుచేస్తుంది. ఇంతవరకూ రాధ సుఖపడుతుంది. సందేహంలేదు. కాని మానవప్రాణి అన్నతరవాత తిండి, గుడ్డ, డబ్బుతోనే తృప్తిపడటం జర గదు. తిండి పరిధానమైన దైనప్పటికీ తత్తుల్యమైన సమస్య లనేకం వున్నాయి.

రాధను నేను అసహ్యించుకొంటాను. అది చేసినతప్పా గూడా లేదు మళ్ళీ. నేనంటే దానికి తగని యిష్టం. నానుండి మంచి చూపుకోసం, వుల్లాసంగా పలికే వాక్య మాటకోసం ఎప్పుడూ చూస్తుంటుంది. కాని నాకు సంతోషం కలగదు.

నా 'దయ' కోసం అది పడేపాట్లు చూస్తే జాలిపుడుతుంది. చాలారోజులు వొంటరిగా కూచుని మథనపడ్డాను. ఏవిధంగానైనా రాధ మనస్సు కష్టపడకుండా చూడాలని గట్టిగా అనుకొంటాను. ఈ క్షణంనుండే, ఇప్పుడే నవ్వుతూ దానిదగ్గరికెళ్ళి, దిగులు బరువుతో కుములుతున్న రాధకు, కాస్త మనశ్శాంతి యిద్దామనుకొంటాను. తీరా దానిదగ్గరకెళ్ళి ముఖంకేసి చూడగానే అపరిమితమైన రోత పుడుతుంది. తలవంచుకొని గిరుక్కున ముఖం తప్పించేవాణ్ణి

రాధ అందగత్తె కాదు. వెడల్పాటి ముఖం, చప్పిడి ముక్కు, చిన్నకళ్ళు, పొట్టిగా, కొంచెం లావుగా వుంటుంది. పొట్టి వెంట్రుకలు జడకు అందక, నూనెకు అణగక ముఖం మీద పడుతుంటాయి. లావాంటి పెదాలు ఎప్పుడూ ఏదో గొణుగుతూనే వుంటాయి. ఇటువంటి వ్యక్తిని అగ్నిసాక్షిగా పెళ్ళిచేసుకొన్నప్పటికీ, ఎట్లాభరించను? నేను గాకుండా మరొకడెవడన్నా రాధను పెళ్ళిచేసుకొనివున్నట్లయితే దాని బతుకు యింత అధ్వాన్నంగా వుండేది కాదేమో! ఎందుకంటే లోకంలోవుండే అందరి అభిరుచులూ వొకేరకంగా ఎప్పుడూ వుండవు. ప్రతిమనిషికీ ప్రత్యేకమైన దృక్పథాలుంటాయి. వాటి పరిధులకు లోబడే వాళ్ళజీవితం నడుస్తుంటుంది. కానప్పుడు యీ యుద్ధాలకు, స్పర్థలకు, సిద్ధాంత సమరాలకు తావే వుండదు. న్యాయచట్టాలు, జైళ్లు పోలీసులు, తుపాకులు అనవసరం.

రాధచింతతో కలతపడిన నా మనస్సుకు స్థిమితానిస్తుంది అన్నపూర్ణ. ఎండనబడి, వడదెబ్బతిని, శోషను

గుర్రైనవాడికి చల్లని పానీయంలాంటిది అన్నపూర్ణ నాకు. ఆమెది మాయింటి కెదురుయిల్లు. భర్తకు బళ్లో టీచరుపని. ఈ వూరు ట్రాన్స్ఫరయి నాలుగు నెలలయింది.

అన్నపూర్ణ ఒకనాడు నీళ్లకు మాయింటి కొచ్చింది. అప్పుడే నేను రాధమీద మండిపడి దొడ్లోకి వొచ్చాను. నీళ్లు తోడుకుంటున్నది అన్నపూర్ణ. నా అలికిడి విని తలెత్తి చూసి, నవ్వి బిందెత్తుకొని వెళ్లింది. నాలుగు రోజులనాటి కల్లా అన్నపూర్ణకు జాముపొద్దుపోయిన తరవాత దెయ్యాల తోపులోకి రావలసిన అవసరం కలిగింది పాపం! అదేరోజున అదేసమయానికి, అదేచోటికి, నేనూ పోవాలిసొచ్చింది తప్పని సరి పని వుండి.

తరుచుగా మేమిద్దరమూ, ఆ దెయ్యాలతోపులోనే కలుసుకొంటుంటాము. అది వూరికి కాస్తదూరంగా, స్మశానాన్ని ఆనుకొనివుంది. వేపచెట్లు, రాగిచెట్లు చాలా ఎత్తుగా ఆకాశంలోకి పరుచుకొని పగలే వెలుతురునుచంపుతుంటాయి. చచ్చినవాళ్లందరూ స్మశానంలోనించి రాత్రిపూట దెయ్యాల ఆకారంతో లేచి ఆ తోటలో తిరుగుతుంటారని చెబుతారు. పొద్దుకూకిన తరవాత అటువేపు ఎవ్వరూ పోరు. తెగించి పోయిన వొకరిద్దరు క్షుద్రసన్యాసులు జడుచుకొని వారం తిరక్కుండానే చచ్చారు. మేము ఇంతకాలం అక్కడ రాత్రిళ్లు చేరుతున్నప్పటికీ ఏ దెయ్యమూ మమ్మల్ని బాధించలేదు. కనీసం కనపడనన్నా లేదు. దెయ్యాలుగూడా వొకానొకప్పుడు మనుషులేగనక, వాటి జీవితంలోగూడా యిటువంటి సంఘటనలు జరిగి, వీళ్లను విచ్ఛిన్నం చేయటం పాపమని భావించు

కొనివైనా వుండాలి. లేకపోతే; దిక్కుమాలిన మానవ లోకంలో మోహావేశాలకు, ప్రణయక్రీడలకు, యింత కంటే మంచి స్థలాలు దొరకటం అసంభవమని తెలుసుకొని, మామీంద జాలిపడి, దూరంగా మాకు కనిపించకుండా ఎక్కడో దాగివుండాలి. ఇదే నిజమయితే అసూయతో, కుళ్లుతో, వంచనతో, మోసపు బతుకుతో, లుక లుక మంటున్న ఈలోకంకంటే దెయ్యాలలోకం ఎంతగొప్పది!

ఒక రాత్రి నేనూ, అన్నపూర్ణ వేపచెట్టుచిక్కనిచీకటి క్రింద, గోరింటపొదపక్కగా వున్నాము. అన్నపూర్ణ నా చేతులమధ్య వున్నది. బైట పసివెన్నెల. చుట్టూ పచ్చని పొలాలు. దూరంగా వూళ్ళో దీపాల కాంతి. గాలికి బిగ్గరిగా వీస్తున్న చెట్ల చప్పుళ్ళు. మా నిండా, మా చుట్టూ చీకటి. అన్నపూర్ణ నాతో ఏమిటో చెబుతోంది. నేను వింటున్నట్టు 'ఊఁ' కొడుతున్నాను అన్నపూర్ణను నా వేపు తీసుకొంటూ. ఉన్నట్లుండి ఎగిరిపడి నన్ను గట్టిగా కావిలించుకొంది అన్నపూర్ణ.

"ఏమిటి ?"

అన్నపూర్ణ వొణుకుతోంది నావొంటిమీద.

"ఏమిటి? చెప్పు ? ఎందుకు వొణుకుతావు ?"

చీకటి బిగ్గరిగా నిట్టూర్పు విడిచినట్లు, గాలి చెట్ల లోంచి దూసుకొని చప్పుడుచేసింది. బరువుగా, దిగులుగా కదిలాయి నీడలు.

అన్నపూర్ణ మాట్లాడలేక గావును, వేలు చూపింది. చూశాను. రెండు నీడలు యిటువేపు వొస్తున్నాయి.

"దెయ్యాలు" అన్నయ్ అన్నపూర్ణ పెదిమలు 'ముద్దుపెట్టుకో' అనటానికి బదులు.

అవిగూడా తమ ప్రణయకేళికి ఈ ప్రదేశాన్నే ఎన్నిక చేసుకొన్నాయి గావును. ఈ దెయ్యాలతోపు ఎంత పుణ్యం చేసుకొందో ఇటువంటి మహత్తర ఘటనలు తనలో జరగడానికి!

"మన్ని చంపుతయ్" అన్నది అన్నపూర్ణ. ఆ స్వరంలో 'యీ దౌర్భాగ్యపు చోటుకి రావటం బుద్ధి తక్కువయింది. ఇక జన్మలో రాను' అన్న ధ్వని మర్మంగా విన్పించింది.

మేమిద్దరం చెట్టుచాటుగా నక్కి, వొరిగి కూచున్నాము. ఏ రోజునా వుండనంత దగ్గిరిగా అదుముకొనివున్నది అన్నపూర్ణ నాకు---దెయ్యాల పుణ్యంవల్ల. ఆ రెండు దెయ్యాలు పక్కచెట్టుకిందికి చేరినై. మేము వూపిరిబిగబట్టి అట్లాగే కూచున్నాము.

కాసేపు అవి రెండూ పడుకొనిలేచి, తరవాత మాట్లాడుకోసాగాయి. మాటలనుబట్టి అవి తెలుగు ఆడ, మగ దెయ్యాలని తెలుసుకొన్నాను.

"నిన్ను చూస్తే నా కడుపు తరుక్కుపోతుంది. నీలాంటి అప్సరసను ఆ బూతుమాట వుపయోగించి

ఎందుకు కాలదన్ని అడ్డమైన తిరుగుళ్ళు తిరుగుతుంటాడో నా కర్థంగాదు. నేనై తేనా ?" మిగతా మాటలకు బదులు ముద్దుబెట్టుకొంటున్న చప్పుడు వినిపించింది.

"ఇదంతా నాకర్మ, రాత. అసలు మగవాళ్ళంతా వొకటే. బంగారమంటి భార్య యింట్లోవుండగా మీరు తిరగటల్లా ?" అన్నది ఆడదెయ్యం.

"దాన్ని చూస్తేనే నాకు రోత. చేసుకొన్న నేరానికి గతిలేక, కాపరంచేస్తున్నా, లోకానికి జడిసి" ఆడదెయ్యాన్ని ముద్దుపెట్టుకొన్న చప్పుడు.

కాసేపటికి మొగదెయ్యం బడిటీచరుగా మారింది. ఆడదెయ్యం రాధగామారింది---చంద్రుడు నెత్తిమీదికొచ్చి నీడలు పడేసిన కారణాన.

---